క్లుప్తంగా

విద్యుత్ తీగలను సరిచేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ శివారు మున్నేరువాగు సమీపంలో వ్యవసాయ భూముల్లో కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లకు శనివారం విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేశారు. మున్నేరువాగు సమీపంలో వ్యవసాయ భూముల్లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలపై 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడటంతో విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు పూర్తి చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో బేతోలు గ్రామంలో శనివారం జనరల్ ఫండ్ నుంచి రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు చైర్మన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, కౌన్సిలర్ భూక్య సునీత, నాయకులు శంకర్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

బానోత్ రెడ్డికి డాక్టరేట్



తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బానోత్ రెడ్డి కృష్ణ విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణ యూనివర్సిటీలో ఆయన రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు.

బురదమయం



మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌కు వెళ్లే దారి బురదమయంగా ఉండడంతో సీసీ రోడ్డును మంజూరు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని హాస్టల్ ఎదుట శనివారం పీడీఎస్‌యూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు విజయ్, నాయకులు బాలకృష్ణ, తరుణ్, ప్రవీణ్, నవీన్, ప్రశాంత్, గోపి పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ



కేసముద్రం: అంతర్జాతీయ కుంగ్‌ఫూ కరాటే అండ్ తైక్వాండో పోటీల్లో కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కి చెందిన కందాల వర్షిని, తోకల సౌమ్య గోల్డ్ మెడల్ సాధించినట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



కేసముద్రం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల జెడ్పీహైస్కూల్‌లో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలు వచ్చినా, ధైర్యంగా ఉండి ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజు, హెచ్‌ఎం కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటీ.. మట్టి రోడ్డయింది..



బుద్దారం గ్రామానికి వెళ్లే రోడ్డు

గార్ల: మండలంలోని బుద్దారం గ్రామానికి వెళ్లే బీటీ రహదారి వర్షాకాలంలో చిత్తడిగా మారి మట్టి రోడ్డుగా తలపిస్తుంది. 8 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బీటీ రహదారి గుండా టిప్పర్లు, లారీలు తిరుగుతుండడంతో పూర్తిగా ధంసమైంది. వర్షాలు కురిసిన సమయంలో చిత్తడిగా తయారవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చరిత్ర ఆనవాళ్లకు బీటలు..

- చారిత్రక కట్టడాలకు రక్షణ కరువు
- కూలుతున్నా పట్టించుకోని వైనం
- రజాకార్ల పాలనలో నిర్మాణం

పెద్దవంగర: గత చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రాతి కట్టడాలు బీటలు వారుతున్నాయి. నిజాం పాలనలో నిర్మించిన చారిత్రక కట్టడాలను రక్షణ కరువైంది. రోజుకింత కూలుతున్న పట్టించుకునేవారు లేరు. మండలంలోని పలు గ్రామాల్లో రజాకార్ల కాలంలో బురుజులు నిర్మించారు. కాగా ఉప్పరగూడెం గ్రామంలో కట్టిన బురుజు పూర్తిగా శిథిలావస్థలకు చేరింది. కింద భాగంలో కట్టడం బాగానే ఉన్న వర్షాలకు రాతికోటపై భాగంలో మట్టితోపాటు అప్పుడప్పుడు ఒక్కొక్క రాయి ఊడి కింద పడుతుంది. కొద్ది రోజులుగా వర్షాలకు గోడలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది.

శత్రువుల రాకను పసికట్టేందుకు..



ఉప్పరగూడెంలో శిథిలావస్థలో ఉన్న బురుజు

నిజాం కాలంలో శత్రువుల రాకను పసిగట్టి వారిని నిలువరించేందుకు రజాకార్ల కోసం గడికోటలు నిర్మించారు. గ్రామాల్లోకి రజాకార్లు, శత్రువులు, దొంగలు లోనికి వెళ్లకుండా పెద్ద పెద్ద బండరాళ్లతో బురుజులు నిర్మించారు. వీటిపై ఎత్తుగా ఓ కట్టడం నిర్మించి అందులో రహస్యంగా చూసేలా ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పహారా ఉంచేవారు. నాటి చరిత్రకు దర్పణంగా నిలిచిన బురుజును పరిరక్షించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులకు నివేదించాం..



మా గ్రామంలో ఉన్న బురుజు కూలిపోతోంది. దాని పరిరక్షణ కోసం సర్పంచ్ పదవి కాలంలో ఉన్నప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లా. శిథిలావస్థలో ఉన్న బురుజు గురించి గ్రామ సభలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాను.

– దుంపల జమున, మాజీ సర్పంచ్, ఉప్పరగూడెం

నాయక పోడులకు న్యాయం చేయాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్: నాయకపోడు తెగల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య (సీతక్క)కు హైదరాబాద్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య మాట్లాడుతూ.. నాయక పోడు తెగలు 1949 నుంచి 1950లో ప్రత్యేక సీరియల్ నంబరు 7లో ప్రత్యేకంగా ఉండేవారన్నారు. కులాల ప్రాతిపదికన విభజన జరిగినప్పుడు 7నంబరులో ఉన్న నాయకపోడు తెగను తీసి గోండు తెగలో కలిపినట్లు తెలిపారు. దీంతో నాయకపోడులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజును ప్రభుత్వం అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రభుత్వమే అధికారికంగా జరపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దబ్బ శ్రీను, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు భోగి వీరస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న హెచ్‌ఎం

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పర్వతగిరి జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మందుల శ్రీరాములు అన్నారు. మండలంలోని పర్వతగిరి పరిధిలోని వీఎస్.లక్ష్మీపురం, రోటిబండ తండా, సోమ్లాతండా ఎంపీపీఎస్ పాఠశాలలను హెచ్‌ఎం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఎఫ్‌ఏ1 పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించడంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, షబ్బీర్, వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమం ప్రస్తావించలేదు'



మాట్లాడుతున్న రాములు

మహబూబాబాద్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల కనీస వేతనాలు, సంక్షేమం, ఇతర సౌకర్యాల గురించి ప్రస్తావించకపోవడం సరైంది కాదని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు విమర్శించారు. సీఐటీయూ జిల్లా వర్క్ షాప్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన శనివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనం రూ.26వేలు, కార్మికుల డిమాండ్ లేబర్ కోడ్ రద్దు గురించి ప్రస్తావించలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాసు మాధవి ఆకుల రాజు కుంట ఉపేందర్, నాయకులు శ్రీనివాస్, రాజమౌళి, వీరన్న, నాగన్న, మల్లయ్య, స్నేహబిందు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: మహిళలు, విద్యార్థినులు, యువతులు చట్టాల గురించి తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక అన్నారు. జిల్లా కేంద్రంలోని అనతారం బీఫార్మసీ కళాశాలలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై న్యాయ చైతన్యం సదస్సు శనివారం నిర్వహించగా జడ్జి మౌనిక హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది దాసరి నాగేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం

తొర్రూరు: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, కేటాయింపుల్లో కేంద్రం వివక్ష చూపిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సోమ రాజశేఖర్, కౌన్సిలర్లు రాము, రోజా పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు సీఐ సంజీవ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో జిల్లా సైబర్ నేరాల నివారణ నిపుణుడు చిర్ర సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న బద్రినారాయణ

డోర్నకల్: 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ముల్కలపల్లి, మన్నెగూడెం, చిల్కోడు, పెరుమాళ్లసంకీస, కన్నెగుండ్ల, డోర్నకల్ ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, జీఓ 11, 12 సవరిస్తూ అర్హత కలిగిన ఉపాధ్యాయులను పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సీతారాములు, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, నాయకులు శ్రీధర్, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

'చులకనగా మాట్లాడడం సరికాదు'

పెద్దవంగర: ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్ట్ వికలాంగుల మనోభావాలను దెబ్బతీశాయని, వెంటనే ఆమెను అరెస్టు చేయాలని పాలకుర్తి నియోజకవర్గం వికలాంగుల సంఘం అధ్యక్షురాలు శివరాత్రి సుగుణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సోమరాములు, ముస్కు శోభన్, జిలుకర సైదులు, ఆలకుంట్ల రేణుక, జంపాల పరమేష్, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు ప్రారంభించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు తొర్రూరు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. మున్సిపల్ కార్యాలయ నిర్మాణం, మినీ ట్యాంక్‌బండ్, బతుకమ్మ ఘాట్, డంపింగ్ యార్డు, వందపడకల ఆస్పత్రి పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ శంకర్, నాయకులు కుర్ర శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, జైసింగ్, నాగరాజు, మణిరాజ్, పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



మాట్లాడుతున్న దేవేందర్

మహబూబాబాద్ అర్బన్: వివిధ గురుకుల పాఠశాల, కళాశాల, ఎంసెట్, నీట్, ఫార్మసీ, యూనివర్సిటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు కుల, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో తహసీల్దార్ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ధ్రువపత్రాలను అందించాలని, లేని పక్షంలో భారీ ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు సిద్దు, హేమంత్, అఖిల్, ప్రణయ్, రామ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు



డోర్నకల్: అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు కందుల నాగరాజు అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కందుల నాగరాజు, విశ్రాంత సైనికులు సత్యనారాయణ, కేశవరావు, గంగాధర్, సామ శ్రీనివాస్ పాల్గొన్నారు.
కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పప్పుల వెంకన్న, బేతమళ్ల చంద్రయ్య, రామ్మూర్తి, గండు నాగన్న, శ్రీను పాల్గొన్నారు.
డోర్నకల్: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, రెడ్డబోయిన శంకర్, ఎంఏ వాజీద్, మొహద్ ఖాసీం, షేక్ ముక్తార్, ఫిరోజ్, నవాబ్ పాల్గొన్నారు.

అన్నివర్గాలను మోసగించేలా బడ్జెట్



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తొర్రూరు: అన్నివర్గాలను వంచించేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని అన్నారం రోడ్డులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు ప్రకటించారని, దానిలో రుణమాఫీకి సగం పోను రైతు భరోసా, కౌలు రైతులు, రైతు కూలీల సంక్షేమం ఎక్కడుందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో రూ.60వేల కోట్లు అప్పులకే సరిపోతున్నాయన్నారు. ఇందులో కేంద్రం నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. అన్ని వర్గాలను మోసగించేలా బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పల్లె కుమార్, రంగు రాములు, సురేష్, రాజేష్, శేఖర్, రాంబాబు, భరత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లోకి వెళ్లేదెలా..!



బురదమయంగా మారిన గూడూరు బస్టాండ్

గూడూరు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఇటీవల కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు బురదలో నడుస్తూ బస్టాండ్‌లోకి వెళ్లి బస్సులు ఎక్కుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సిమెంట్ కాంక్రీట్‌తో పనులు చేయించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు వైద్య పరీక్షలు
నర్సింహులపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో శనివారం 52 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, సూపర్‌వైజర్ సుజాత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి
కొత్తగూడ: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తుడుం దెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు భిక్షం, మహేందర్, రాంచందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి
గార్ల: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, కొండల్‌రావు, శ్రీకాంత్, సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి
కురవి: కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు రైత బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 28వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు, ఇప్పటి వరకు రైతుబీమా చేసుకోలేకపోయిన రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని తెలిపారు.

స్థలం మంజూరు చేయాలి
నర్సింహులపేట: మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తు శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, నాయకులు తప్పెట్ల వీరన్న, మండల కమిటీ అధ్యక్షుడు ఎర్ర వెంకట్రాంనర్సయ్య, రాపాక సుధాకర్ పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు
డోర్నకల్: భారీ వర్షాలతో పలు వీధుల్లో బురదమయమైన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాలతోపాటు పలు ప్రాంతాల్లో రోడ్లపై డస్ట్, చిప్స్ చల్లారు. కార్యక్రమంలో ఐస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్ శరత్, ప్రిన్సిపాల్ రిజ్వానా, కోఆప్షన్ సభ్యులు అజీత్‌మియా, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై చర్య చేపట్టాలి
నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. నాయకులు యాకూబ్, సైదులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



తొర్రూరు: ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఆర్టీసీ సంస్థ కృషి చేస్తోందని తొర్రూరు డీఎం పద్మావతి తెలిపారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, మెకానిక్‌లకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఏఎంఎఫ్ సమద్, ఎస్‌టీఐ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చేయి
కురవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచేయి చూపారని వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు సయ్యద్ ఖాజా అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కందిపాటి ఉమేష్, కర్నాటి మల్లికార్జున్, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

కేసు నమోదు
డోర్నకల్: మండలంలోని తెల్లబండతండాలో గుడుంబాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు బానోత్ కాంతి, బానోత్ చిలకను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్‌రావు శనివారం తెలిపారు.

సీనియర్ కబడ్డీ క్రీడాకారుడి మృతి
మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు నూకల యాదగిరి అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు నివాళులర్పించారు.


పౌష్టికాహారంతో శారీరక దృఢత్వం
డోర్నకల్: బాల్యం నుంచే పౌష్టికాహారం తీసుకుంటే శారీరక దృఢత్వం వస్తుందని మన్నెగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం విత్తనాల సుధాకర్ తెలిపారు. పాఠశాలలో శనివారం విద్యార్థులు ఇళ్ల వద్ద జొన్నలు, పల్లీలతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేసి పాఠశాలలో ప్రదర్శించారు.

ఫిజియోథెరపీపై అవగాహన
పెద్దవంగర: కదలిక రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు ఫిజియోథెరపీ ఎంతో తోడ్పడుతుందని ఎమ్ఎన్ఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు నిజాం ఇనిస్టిట్యూట్ చెందిన ఫిజియోథెరపిస్టులు సంతోష్, సహాయకులు ప్రసాద్ ఫిజియోథెరపీ చేసి నేరుగా అవగాహన కల్పించారు.

ఫీవర్ సర్వే
మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని 17వ వార్డు పరిధిలోగల బాబు జగ్జీవన్ రావు కాలనీకి చెందిన ఒకరికి డెంగీ పాజిటివ్ రావడంతో శనివారం మున్సిపల్ సిబ్బంది కాలనీలో బ్లీచింగ్ చేశారు. ఇంటింటికి రాపిడ్ ఫీవర్ సర్వే చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యశ్రీ, రామకృష్ణ, మమత పాల్గొన్నారు.

కేసు నమోదు
డోర్నకల్: ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించిన తొడేళ్లగూడెంకు చెందిన తాళ్లూరి శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన దళిత యువకుడు కిరణ్‌పై ఆదే గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీనివాస్ కులం పేరుతో దూషించి దాడి చేశాడని, బాధితుడు కిరణ్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన



కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని లాలుతండా జీపీ శివారు రూప్లాతండాలో బురదమయంగా మారింది. శనివారం రోడ్డుపై వరి నాట్లు వేసి తండావాసులు నిరసన తెలిపారు. బడికి వెళ్లే పిల్లల తోపాటు, తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం

గూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని జెడ్పీ కోఆప్షన్ ఎండి. ఖాసీం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ వీరస్వామి అధ్యక్షతన బదిలీపై వెళ్తున్న 8 మంది ఉద్యోగులను సన్మానించారు. ఎంపీఓ చంద్రమోహన్, సూపరింటెండెంట్ కరణ్‌సింగ్, జూనియర్ అసిస్టెంట్ ఇమామ్, టైపిస్ట్ నాగరాజులతోపాటు నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు.

ఏజెన్సీలో వైద్యసేవలు అందించాలి

బయ్యారం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నందున ప్రభుత్వం వైద్య సేవలు అందించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు తుడుం వీరభద్రం అన్నారు. శనివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, మునిందర్, మురళి పాల్గొన్నారు.